చేస్తున్నాడు"– చిన్నగా నవ్వుతూ చెప్పాడు డి.ఐ.జి.

"ఇంతకంటే ఘోరం మరొకటి వుండదు సార్. పైగా... మధ్యలో... ఇటువంటివి సహించని ఎస్.పి. నేనొకడిని వున్నానని అందరూ మరిచిపోయారు..."

గుండెలు తెగిపోయే ఆవేదన ధ్వనించింది జయదేవ్ గొంతులో.

"అందుకే ...మనం ఏదీ మనసుకు తీసుకోకూడదని నీకు ఇంతకు ముందే చెప్పాను. దీనికే తట్టుకోలేని వాడివి.. రేపో, మాపో స్పెషల్ బ్రాంచి వాళ్లు ఆ నిర్దేశ్‌ని ఖతం చేసి....'పోలీసుల్ని కొట్టి పారిపోతుండగా జరిపిన కాల్పుల్లో తీవ్రవాది వుల్లన్న మృతి...' అనే వార్తని పంపితే నువ్వింకేం తట్టుకుంటావు!"

"అంటే ... అంటే... నిర్దేశ్‌ని బూటకపు ఎన్‌కౌంటర్ చెయ్యబోతున్నారా? ఇది దారుణం. నేనంటూ బ్రతికుండగా దీనిని జరగనివ్వను"– ఆవేశంగా చెప్పాడు జయదేవ్.

"జరగనివ్వక... నువ్వేం చెయ్యగలవు?" డి.ఐ.జి. కంఠంలో అందాకా వున్న మృదుత్వం మాయమయిపోయింది.

"అది కాదు సార్..." ఏదో చెప్పబోయాడు జయదేవ్.

"చూడు జయదేవ్. అనుభవంలో నీకంటే పెద్దవాడిని చెబుతున్నాను. ఇందులో వ్రేలు పెట్టాలని ప్రయత్నిస్తే, నువ్వు తప్పకుండా ఖర్చయిపోతావు. వెనకవున్న పెద్ద తలకాయలు నిన్ను శంకరగిరి మాన్యాలు పట్టిస్తాయి. ఐ అడ్వయిజ్ యు టుబి సైలెంట్ ఆన్ దిస్. ఆపైన నీ ఇష్టం!...."– డి.ఐ.జి. ఫోన్ పెట్టేశాడు.


ఆ తర్వాత చాలా సేపు అలాగే సోఫాలో నీరసంగా కూలబడి కూర్చుండిపోయాడు ఎస్.పి. జయదేవ్.

ఎంతో ఘోరమైన పరిణామాలు జరిగిపోతున్నా తను అసహాయుడుగా మిగిలిపోయాడు. ఇటువంటి అసమర్థపు ఉద్యోగం చెయ్యడం కంటే రాజీనామా చెయ్యడం మేలు. అయితే... తను అలా చెయ్యడం వల్ల సహదేవరావు లాంటి వాడికే లాభం చేకూరుతుంది కాని... నిర్దేశ్ లాంటి అమాయకుడికి ప్రయోజనం వుండదు.

బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు జయదేవ్.

ఆ నిర్ణయం ఇక అతి కొద్దిగంటల్లో రాష్ట్రంలో ఒక మహా సంచలనానికి తెర తియ్యబోతోంది!

(సశేషం)



# అమ్మా నన్ను క్షమించు

ప్రియమైన అమ్మకు,

మీ కుమార్తె నమస్కరించి వ్రాయునది.

అమ్మా! ఈ పదంలోనే భగవంతుడు ఎంత హాయిని పెట్టాడా? అనిపిస్తుంది. ప్రతి రోజూ, ప్రతి క్షణం జీవితరణరంగంలో యుద్ధం చేస్తూ అలసిపోయి ఎపుడయినా యిలా కూర్చుని చల్లగా 'అమ్మ' అనే పదం హృదయాన్ని తాకుతుంటే ఎంత హాయి! కేవలం నాదే అయిన నా మనసుకు సంబంధించినదే కనుక– దానికి ఎవరి అభ్యంతరాలూ, ఆటంకాలూ, వుండవు కనుక గుండెలలో ఎంత శాంతి! ఎంత మనశ్శాంతి! భగవంతుడు ప్రతి మనిషికీ మంచి 'అమ్మ' నిచ్చాడు. కాని మనుష్యులు మాత్రం పూర్వం నుండి ఒకే చెత్త సిద్ధాంతాన్ని, సాంప్రధాయాన్ని అమలులో వుంచుతున్నారు. ప్రతి తల్లి ఆడపిల్లను, మగపిల్లవాడిని ఒకే కష్టంతో, ఒకే శ్రమతో కని, ఒకే ప్రేమతో పెంచితే, తల్లిదండ్రులు తమ బాధ్యతగా పెంచితే పెద్దయ్యాక కొడుకు మాత్రం విధిగా తల్లిదండ్రుల బాధ్యత తీసికొంటాడు. కూతుళ్ళకు మాత్రం ఆ హక్కు లేదు. కొడుకు తల్లిదండ్రుల బాధ్యత వహించినా కోడలు అభ్యంతర పెట్టకూడదు. కూతుళ్ళ మనస్సులలో కన్నవారిపై ఎంత ప్రేమ వున్నా అల్లుడు వూరుకోడు. కొడుకులు తల్లిదండ్రుల అవసరాలకు డబ్బు పెట్టాలి. కాని కూతుళ్ళు కన్నతల్లిదండ్రులను తిరిగి చూడకూడదు. కొడుకులు తల్లిదండ్రులను తమ దగ్గర వుంచుకొని వారి పోషణ భారం వహించాలి. అది తర తరాల నుండి అన్ని జాతుల వారిలోను, అన్ని మతాల వారిలోను నియమం! భార్యలకు యిష్టమున్నా లేకపోయినా యీ సాంప్రదాయాన్ని కాదనే హక్కు లేదు. కూతురు తల్లిదండ్రులకు డబ్బు యివ్వకూడదు. తాను స్వయంగా సంపాదిస్తున్నా యివ్వకూడదనేది నియమం! – వారిని తన దగ్గర వుంచి పోషించే హక్కు భర్త యివ్వడు. ఈ విషయంలో సమాజమంతా అతనినే సమర్థిస్తుంది! ఎందుకయ్యా యీ తారతమ్యం! చిన్నతనంలో ఒక్కక్షణమైనా అమ్మను వదలని కూతురు తల్లికి పూర్తిగా దురమయిపోతుంది! ఇదెంత అన్యాయం? సృష్టి కర్త ఆడదానికి ఒకరకంగా అన్యాయం చేస్తే తొలి నాటి పురుషులు స్వార్థంతో ఆడదానిని తమ సొత్తులాగ భావించి స్త్రీని వంశపారంపర్య బానిసగా చలామణీ చేసుకున్నారనిపిస్తుంది. యుగయుగాలు మారినా యిదే సిద్ధాంతం! యిదే మానవ మనుగడ! ఎంత చదివినా, ఎంత విజ్ఞాన వంతురాలయినా స్త్రీలో యీ బానిసత్వపు ఆలోచన నుండి బయటపడదామని వుండదు.

అమ్మా! నీవు నా గురించి ఏమనుకుంటావో కాని నా మనసులో నీకు మాత్రం ఒక భావాలకందని అతీతమయిన అద్భుత స్థానం వుందమ్మా! నా మనస్సు మీద ఆంక్షలు పెట్టడానికి ఎవరూ లేరు కదమ్మా! అలాగని నీకు నేనేమీ చేయలేను కదమ్మా! కనీసం ఒక్క పండు అయినా కొని పెట్టలేనుకదమ్మా! నన్ను క్షమించు అమ్మా!

– ప్రేమతో,
నీ కుమార్తె

– ఎస్. సులోచన